విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

## ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన మేరకు ఓబులమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే


మడకశిర ఆగస్టు 22, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మడకశిర మండలం కే గుండుమల గ్రామం కు వచ్చినప్పుడు నిరుపేద మహిళ ఓబులమ్మ ఉండడానికి తనకు సొంత ఇల్లు లేదు అని ముఖ్యమంత్రి కి తెలియజేయడంతో వారు ఆ రోజు వెంటనే నూతన గృహాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగా ఈరోజు మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఓబులమ్మ నూతన గృహ నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. అలాగే సీఎం హామీలో భాగంగా రామన్న అను వ్యక్తికి ప్రభుత్వ సహాయంతో గొర్రెలు మంజూరు చేయడం జరిగింది .





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం 23-08-2024 సంపుటి : 06 సంచిక : 334 పేజీలు : 8 వెల : రూ 3-00

# అచ్యుతాపురం బాధితులను పరామర్శించిన చంద్రబాబు..

## మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం






అమరావతి : విశాఖపట్నం అచ్యుతాపురం సెజ్ ఫార్మా కంపెనీరియాక్టర్ పేలిన ఘటనలో ప్రమాద కుటుంబాలను ఏపీ సీఎం చంద్రబాబు గురువారం పరామర్శించారు. ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి బయలుదేరిన సీఎం విశాఖకు చేరుకున్నారుమెడికవర్, కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితుల వద్దకెళ్లి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎంత ఖర్చు అయినా అందరికీ వైద్య సేవలందిస్తామన్నారు. అవసరమైన వారికి ప్లాస్టిక్ సర్జరీ కూడా చేయిస్తామని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని బాధితులకు భరోసా ఇచ్చారు. మేము అన్నీ చూసుకుంటామని భరోసా కల్పించారు.ఫార్మా కంపెనీలో జరిగిన ఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ ఘటనలో 17 మంది మరణించారని, 36 మందికి గాయాలయ్యాయని తెలిపారు. 10 మందికి తీవ్రగాయాలయ్యాయని,26 మందికి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు.బాధితులందరికీ ఉత్తమ వైద్య సేవలందించాలని ఆదేశించామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. కోటి, తీవ్రంగా గాయపడ్డవారికి రూ. 50 లక్షలు, స్వల్పంగా గాయపడ్డవారికి రూ.25 లక్షలు పరిహారం అందజేస్తామన్నారు.

## అచ్యుతాపురం ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీగ్ర్భాంతి



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం( ఫార్మా సెజ్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన ఘోర ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సెజ్‌లో రియాక్టర్ పేలిన ఘటనలో 17మంది మృతి చెందగా, మరో 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు.క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు పీఎం సహాయ నిధి నుంచి పరిహారం అందిస్తామని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు చొప్పున పరిహారం అందిస్తామన్నారు. గాయపడిన వారికి రూ. 50వేలు చొప్పున పరిహారం అందిస్తామని పేర్కొన్నారు.రియాక్టర్ పేలిన ఘటనలో ప్రమాద కుటుంబాలను ఏపీ సీఎం చంద్రబాబు గురువారం పరామర్శించారు. విశాఖ మెడికవర్, కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఎంత ఖర్చు అయినా అందరికీ వైద్య సేవలందిస్తామన్నారు. అవసరమైన వారికి ప్లాస్టిక్ సర్జరీ కూడా చేయిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. కోటి, తీవ్రంగా గాయపడ్డవారికి రూ. 50 లక్షలు, స్వల్పంగా గాయపడ్డవారికి రూ.25 లక్షలు పరిహారం అందజేస్తామన్నారు.

## పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం దిశగా అడుగులు: పవన్



పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం దిశగా అడుగులు వేస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. అందులో భాగంగా దేశంలో ఎప్పుడూ లేని విధంగా రేపు 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 87 రకాల పనుల కోసం ?4,500 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. ఆ పనులకు సంబంధించి గ్రామ సభల్లో తీర్మానాలు చేస్తామని పేర్కొన్నారు. 9 కోట్ల ఉపాధి దినాలతో 54 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు.

## అందుబాటు ధరల్లో బిర్లా ఓపస్ పెయింట్ ధరలు







విభారే న్యూస్. ఆగస్టు 22 కర్నూల్ ప్రతినిధి బిర్లా ఓపస్ పెయింట్ ఇతర పోటీదారుల కంటే తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నాయని బిర్లా ఓపస్ పెయింట్ మార్కెటింగ్ రాష్ట్ర హెడ్ సుమన్ రెడ్డి తెలిపారు. గురువారం నంద్యాల చెక్ పోస్ట్ నందికొట్కూరు రోడ్డులో బిర్లా ఓపస్ పెయింట్ శ్రీ తిరుమల ఎంటర్ప్రైజెస్ ను క్లాస్ 1 కాంట్రాక్టర్ పల్లె ప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిర్లా ఓపస్ పెయింట్ మార్కెటింగ్ రాష్ట్ర హెడ్ సుమన్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలోనే కర్నూలులో బిర్లా ఓపస్ పెయింట్ తొలి షోరూంను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.అత్యుత్తమ ఉత్పత్తి, నాణ్యతతో వినియోగదారులను ఆకర్షించడమేలక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి 20 లీటర్ల పెయింట్ కొనుగోలుకు కంపెనీ 10శాతం ఆఫర్లు ప్రకటించినట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలోడీలర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు



అమరావతి : మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్వయంకృషితో సినీరంగంలో ఎన్నో విజయాలను అందుకున్నారని చిరంజీవిని కొనియాడారు. ఎన్నో అద్భుత పాత్రలు పోషించిన ఆయన వెండితెర ఆణిముత్యమని , తరాలు మారినా చెక్కుచెదరని ప్రేక్షకాభిమానం ఆయన సొంతమని అన్నారు.చిరంజీవి స్థాపించిన ఐ బ్యాంక్ బ్లడ్‌బ్యాంక్ లు ఆయన మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. చిరంజీవి మరెన్నో విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని వెల్లడించారు.అన్నయ్యకు తమ్ముడు శుభాకాంక్షలుటాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి 69వ పడిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అభిమానులు ఘనంగా బర్త్ డే వేడుకలను ఘనంగా జరుపుతున్నారు. ఈ సందర్భంగా అన్నయ్య చిరంజీవికి తమ్ముడు, నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు గురువారం తెలిపారు.నా దృష్టిలో అన్నయ్య చిరంజీవి ఆపద్బాంధవుడు.. అన్నయ్య పుట్టినరోజు సందర్భంగా ప్రేమపూర్వక శుభాకాంక్షలు. ఆపత్కాలంలో ఆయన ఎంతోమందికి సాయం చేయడం నాకు తెలుసు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రాణదానం చేసిన సందర్భాలు అనేకం. కావాల్సిన వారి కోసం ఎంతవరకైనా తగ్గుతారు.

దర్శించండి ! భక్తకోటికి ఆహ్వానము తరించండి !!

శ్రీ నరసింహ ఈరణ్ణస్వామి దేవస్థానము

ఉరుకుంద గ్రామము - 518344, కౌతాళం మండలం, కర్నూలు జిల్లా. (ఆం.ప్ర)

2024 శ్రావణమాస ఉత్సవాలు తేది: 05-08-2024 సోమవారం నుండి తేది: 02-09-2024 సోమవారం వరకు

శ్రీ స్వామి వారి శ్రావణమాస విశేష వారములు
తేది 05-08-2024 మొదటి సోమవారం
తేది 12-08-2024 రెండవ సోమవారం
తేది 19-08-2024 మూడవ సోమవారం
తేది 26-08-2024 నాల్గవ సోమవారం
తేది 02-09-2024 ఐదవ సోమవారం







శ్రీ స్వామి వారి శ్రావణమాస విశేష వారములు
తేది 08-08-2024 మొదటి గురువారం
తేది 15-08-2024 రెండవ గురువారం
తేది 22-08-2024 మూడవ గురువారం
తేది 29-08-2024 నాల్గవ గురువారం

2024 శ్రావణమాసం ఐదవ సోమవారం తేది: 02-09-2024 స్వామి వారికి పల్లకి ఉత్సవము సాయంత్రం గం॥ 5.00 నుండి రాత్రి గం॥ 9.00 వరకు దేవస్థాన అర్చక బృందము, వేదపండితులు, దేవస్థాన అధికారులు, సిబ్బంది ఆధ్వర్యములో అత్యంత వైభవోపేతముగా నిర్వహించబడును.

భక్తులకు సూచన: శ్రావణమాసములో శ్రీస్వామి వారికి విశేష వారములందే కాకుండా శ్రావణమాసము నెల రోజులు విశేష దినములే కావున భక్తులు/ యాత్రికులు, గ్రామ ప్రజలు అందరూ పాల్గొని శ్రీ స్వామి వారి సేవలో తరింతురుగాక...

ధర్మకర్తల మండలి మరియు సభ్యులు అందరూ ఆహ్వానితులే... శ్రీ స్వామి వారి సేవలో... ఉప కమీషనరు & కార్యనిర్వహణాధికారి మరియు ఆలయ అర్చకులు, కార్యాలయ సిబ్బంది

# ప్రభుత్వాలు మారినా మారని బ్రాండ్లు

విజయవాడ, ఆగస్టు 22 ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి చంద్రబాబు వచ్చినా మద్యం దుకాణాల్లో విక్రయించే బ్రాండ్లలో మాత్రం మార్పు రాలేదు. బాబు వస్తే అన్ని మారిపోతాయి. నాణ్యమైన మద్యం అందుబాటులోకి వస్తుంది, ధరలు దిగొస్తాయని ఆశించిన మద్యం ప్రియులకు భంగపాటు తప్పలేదు. ప్రభుత్వాలు మారి మూడు నెలలు గడుస్తున్నా టీడీపీ మిత్ర పక్షాలు విమర్శలు గుప్పించిన జే బ్రాండ్లే ఇంకా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్నారు. మద్యం దుకాణాల్లో విక్రయించే బ్రాండ్లను రోజువారీ అమ్మకాల ప్రాతిపదికన ఏపీ బేవరేజీస్ కార్పొరేషన్ డిస్టిలరీల నుంచి కొనుగోలు చేస్తుంది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా పాత బ్రాండ్లనే విక్రయించడంలో మతలబు ఏమిటో ఎవరికి అంతు చిక్కడం లేదు. మరోవైపు ఏపీ బేవరేజీస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి అచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మద్యం కొనుగోళ్లు, అమ్మకాలలో వినియోగదారుడికి, తయారీదారులకు మధ్య ప్రభుత్వమే మధ్యవర్తిగా ఉన్నపుడు ఇంకా నాసిరకం మద్యం, ఊరు పేరు లేని బ్రాండ్లనే మూడ్నెల్లుగా ఎందుకు విక్రయిస్తున్నారనే దానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ధరలను తగ్గించే అంశం కొత్త మద్యం పాలసీలో తీసుకోవాల్సి ఉన్నా, బ్రాండ్ల లభ్యత అంశం మాత్రం బేవరేజీస్ కార్పొరేషన్ చేతుల్లోనే ఉంటుంది. మద్యం దుకాణాల్లో విక్రయించాల్సిన బ్రాండ్లను నిర్ణయించే బేవరేజీస్ కార్పొరేషన్ కొన్ని బ్రాండ్లనే ఇప్పటికీ అందుబాటులో ఉంచుతోంది. ఎన్నికలకు ముందు వరకు ఏ బ్రాండ్లనైతే జే బ్రాండ్లుగా తిట్టిపోశారో అవే బ్రాండ్లను ఇప్పటికీ విక్రయిస్తున్నారు. ఇదంతా కొందరి కనుసన్నల్లో వ్యూహాత్మకంగా జరుగుతోందనే అనుమానాలు ఉన్నాయి. ఏపీలో కొత్త ఎక్సైజ్ పాలసీ అక్టోబర్ నుంచి అమల్లోకి రానుంది. మద్యం పాలసీలో ప్రైవేట్ మద్యం దుకాణాలను ప్రారంభించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. ఇది కొంత మేరకు సత్ఫలితాలను ఇచ్చింది. ఇప్పుడు ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పోయినా ఫర్లేదు మద్యం అమ్మకాలు ప్రైవేట్‌కు ఇచ్చేయాలని ఎన్డీఏ కూటమి భావిస్తోంది. ఇందులో భాగంగానే పాత బ్రాండ్లనే ఇంకా దుకాణాల్లో విక్రయిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. మద్యం విక్రయాల్లో వేల కోట్ల రుపాయల లాభాలు కళ్ల ముందుకు కనిపిస్తుండటంతో వాటిని దక్కించుకునేందుకు రాజకీయ పలుకుబడి ఉన్న లిక్కర్ సిండికేట్లు పావులు కదుపుతున్నాయి. ప్రైవేట్ మద్యం దుకాణాలను అనుమతిస్తే ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడే ప్రమాదం ఉంది. అయితే ప్రభుత్వ పెద్దల నిర్ణయానికి ఎదురు చెప్పే సాహసం ఐఏఎస్ అధికారులు చేయకపోవచ్చు. ప్రైవేట్ దుకాణాలను అనుమతిస్తే డిస్టిలరీ నుంచి నేరుగా దుకాణాలకు నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం కూడా సరఫరా చేసే ప్రమాదం ఉంటుంది. బేవరేజీస్ కార్పొరేషన్ నుంచి సరఫరా చేసే మద్యం స్థానంలో నేరుగా డిస్టిలరీ నుంచి కొనుగోలు చేసే మద్యాన్ని విక్రయించి లిక్కర్ సిండికేట్లు లాభ పడిన ఉదంతాలు గతంలో కొకొల్లలుగా ఉన్నాయి. ఇక మద్యం దుకాణాలను నేరుగా డిస్టిలరీలే దక్కించుకునే అవకాశం కూడా ఉంటుంది. బినామీ పేర్లతో మద్యం వ్యాపారంలోకి నేరుగా డిస్టిలరీలు ప్రవేశించడం ద్వారా లాభాలను దక్కించుకోడానికి ప్రయత్నిస్తారనే అనుమానాలు ఉన్నాయి. ప్రైవేట్‌కు మద్యం వ్యాపారాన్ని అప్పగించడం ఎంత మేరకు ప్రభుత్వానికి లాభమనే ఆలోచన లేకుండా ఎక్సైజ్ మంత్రి నుంచి అధికారుల వరకు ప్రైవేట్ రాగం ఆలపించడం వెనుక ముందస్తు ప్రణాళిక ఉందనే అనుమానాలు ఉన్నాయి. ఏపీలో గత ఐదేళ్లుగా రకరకాల బ్రాండ్లను ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించినా జనం మరో దారి లేక వాటినే కొనుగోలు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు రెట్లు ధరలు పెంచిన ప్రభుత్వం మద్యం తయారీదారుల్ని తన దారిలోకి తెచ్చుకోడానికి రకరకాల అస్త్రాలు ప్రయోగించింది. ఈ క్రమంలో మద్యం మీద కళ్లు చెదిరే ఆదాయం కూడా ప్రభుత్వానికి వచ్చింది. మద్యం డిస్టిలరీలు, అమ్మకాలు, నగదు చెల్లింపులు మాత్రమే చేసినా ప్రభుత్వానికి ఏటా రూ.36వేల కోట్ల ఆదాయం వచ్చింది. 2018-19 నాటికి ఈ ఆదాయం రూ.18వేల కోట్లు మాత్రమే ఉండేది. కేవలం ధరల ఆధారంగానే మద్యం అమ్మకాలు జరిగినా జనం జేబులు ఖాళీ చేసుకుంటూ నాసిరకం మద్యాన్ని విధిలేని పరిస్థితుల్లో కొనుగోలు చేసేవారు. 2019 నాటికి రూ.100లోపు ధర ఉన్న ఐఎంఎఫ్ఎల్ మద్యం ధర దాదాపు రెట్టింపు అయ్యింది. పాపులర్ బ్రాండ్లు మొత్తం కనుమరుగై పోయాయి. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం మద్యం ధరల్ని గాడిన పెడుతుందని భావిస్తే మళ్లీ ప్రైవేట్ దుకాణాలను తెచ్చేందుకు ఉత్సాహం చూపడం పలు అనుమానాలకు తావిస్తోంది. మద్యం ధరల్ని గణనీయంగా తగ్గిస్తామనే ప్రకటన ప్రజలకు ఊరటనిచ్చినా ప్రైవేట్ దుకాణాలతో లాభం ఎవరికనే సందేహాలు లేకపోలేదు. మద్యం తయారీ మొదలు విక్రయాల వరకు ప్రతి పైసాకు నాలుగైదు రెట్లు లాభాలు ఉండటాయి. దీంతో కొత్త మద్యం పాలసీపై లిక్కర్ సిండికేట్లు కన్నేశాయి. ఐదేళ్లుగా మద్యం విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం చాలా వరకు ప్రభుత్వ ఖజానాకు చేరింది. ప్రభుత్వం విక్రయించిన మద్యం నాణ్యత, ధరలపై ఎన్ని విమర్శలు ఉన్నా మద్యం ద్వారా లభించిన ఆదాయం మాత్రం గణనీయంగా పెరిగింది. ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త లిక్కర్ పాలసీ ప్రవేశ పెడుతుందనే వార్తల నేపథ్యంలో లిక్కర్ సిండికేట్లు జోరుగా ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ఇప్పటికే ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వ పెద్దల్ని ఒప్పించడంలో అవి సక్సెస్ అయ్యాయి. వీలైనన్ని మద్యం దుకాణాలను దక్కించుకోడానికి సిండికేట్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఐదేళ్లుగా ప్రభుత్వమే నేరుగా మద్యాన్ని విక్రయించడంతో ఆదాయాన్ని కోల్పోయిన వ్యాపారులు, రాజకీయ నాయకులు, డిస్టిలరీలు కుమ్మక్కై కొత్త పాలసీని ప్రభావితం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏపీలో మద్యం విక్రయాలను మించిన ఆదాయ మార్గం ప్రభుత్వానికి మరొకటి లేదు. ఏటా రూ.36వేల కోట్ల రుపాయల ఆదాయం ఖజానాకు లభిస్తోంది. ఇందులో నాలుగో వంతు ఉత్పాదక వ్యయంగా పోయినా దాదాపు రూ.27వేల కోట్ల రుపాయలు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయంగా లభించేది. 2019కు ముందు మద్యం ద్వారా ప్రభుత్వానికి సమకూరిన ఆదాయంలో మద్యం దుకాణాలు కూడా భారీగానే లాభపడ్డాయి.

# చంద్రగిరిలో పెండింగ్ పనులకు టీటీడీ నిధులు

తిరుపతి, ఆగస్టు 22 ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అతి పెద్ద నియోజకవర్గం చంద్రగిరి. ఇక్కడ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత గ్రామం ఉంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలను ఆసక్తిగా చూసేలా చేసింది ఈ నియోజకవర్గం. అలాంటి నియోజకవర్గంలో రహదారులకు, వంతెనలకు మోక్షం కలిగింది. 2021లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భారీగా వర్షాలు పడ్డాయి. వర్షాల కారణంగా స్వర్ణముఖినది ఉగ్రరూపం దాల్చి పంటలు, ఇళ్లు, రోడ్లు, రహదారుల, వంతెనలు పూర్తిగా ధ్వంసం చేసింది. నాటి వైసీపీ ప్రభుత్వం వాటి నిర్మాణానికి తాత్కాలిక మరమ్మతులు చేసిందే తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదు. దీంతో గత మూడు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న రహదారులు, వంతెనలపై ప్రజలు అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో గతంలో 10 సంవత్సరాల కాలం మాజీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేగా పని చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుమారుడు ఎంపీపీ, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పరిపాలన సాగించారు. వారి పరిపాలన కాలంలోనే రహదారుల, వంతెనలు, చెరువులు దెబ్బతిన్నాయి. రాయల చెరువుకు గండి పడితే సుమారు 50 గ్రామాలకు వరద ముప్పు ఏర్పడింది. గండి పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేవరకు అక్కడే బస చేశారు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. ఆ పనులుతప్ప నియోజకవర్గంలో ఎలాంటి మరమ్మతులు చేయలేదు. నియోజకవర్గంలో పాడైన రోడ్లు, వంతెనల కోసం రూ.100 కోట్లు మంజూరైందన్నారు. దానిని అమలు చేసే లోపు ఎన్నికల కోడ్ వచ్చిందని తెలిపారు. టెండర్ల స్థాయిలోనే ఆ పనులు నిలిచిపోయాయని తెలిపారు. కొత్తగా ప్రభుత్వం రాకతో ఇప్పుడు ఆ నిధులు ఏమయ్యాయో తెలియదంటున్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారి ఎమ్మెల్యే హోదాలో అసెంబ్లీకి హాజరైన నాని ముఖ్యమంత్రికి నియోజకవర్గంలోని రహదారుల మరమ్మత్తులు, వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. దానిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అయితే గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.100 కోట్లు ఏమయ్యాయి అనేది మాత్రం చెప్పడం లేదు. చంద్రగిరి నియోజకవర్గంలో వర్షాల కారణంగా చాలా వరకు వంతెనలు, రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రధానంగా చిగురువాడ, తనపల్లి, తిరుచానూరు ఇలా స్వర్ణముఖి నది ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో తీవ్రంగా నష్టం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని ఇచ్చిన వినతి మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు టీటీడీకి లేఖ రాశారు. చంద్రగిరి నియోజకవర్గంలో రహదారులు, వంతెనలు నిర్మాణానికి టీటీడీ నిధులు విడుదల చేయాలనేది ఆ లేఖలోని సారాంశం. తిరుమలకు వచ్చే యాత్రికులు తిరిగే తిరుపతి లాంటి ప్రాంతాలో పారిశుధ్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు టీటీడీ నుంచి కొంత నిధులు ఇవ్వాలని తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ వినతి మేరకు టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుంది. దీనిపై కొందరు, కొన్ని పార్టీలు మినహా తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ నిర్ణయాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెనక్కి తీసుకున్నారు. అయితే అప్పుడు టీటీడీ నిధులు తిరుపతికి వద్దని పోరాటాలు చేసిన కూటమి నాయకులు నేడు చంద్రగిరిలో రహదారులు, వంతెనల నిర్మాణానికి టీటీడీ నిధులు ఎలా మంజూరు చేస్తారని వైసీపీ ప్రశ్నిస్తోంది. దానిని ఎలా సమర్థిస్తారాని నిలదీస్తున్నారు.

# ఫార్మా మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

## కేజీహెచ్ మార్చురీ వద్ద బాధిత కుటుంబాలను పరామర్శించిన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాఖపట్టణం, ఆగస్టు 22 అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్ ఎసెన్షియా సంస్థలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులు, ఉద్యోగుల బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించనున్నట్లు విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. కేజీహెచ్ మార్చురీ వద్ద బాధిత కుటుంబాలను జిల్లా కలెక్టర్ గురువారం ఉదయం పరామర్శించి ఓదార్చారు. వారితో మాట్లాడి దుర్ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన మీడియాతో కలెక్టర్ మాట్లాడారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారికి నష్ట పరిహారం చెల్లింపు, క్షతగాత్రులకు వైద్య చికిత్సకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి ఒక్కో కుటుంబానికి, వారసులకు రూ.కోటి పరిహారం చెల్లించనున్నట్లు వివరించారు. క్షతగాత్రులకు చెల్లించే పరిహారం విషయంలో ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఫార్మా సెజ్లో జరిగిన ఉదంతం అనుకోని దుర్ఘటన అని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి, విశాఖపట్టణం జిల్లాల యంత్రాంగాలు సకాలంలో స్పందించి చాలా మంది ప్రాణాలు కాపాడగలిగాయని అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన 12 మృతదేహాలు కేజీహెచ్ కు వచ్చాయని చెప్పారు. గాయపడిన వారిలో పది మంది విశాఖపట్టణంలోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వెంకోజిపాలెంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఏడుగురు, కిమ్స్ ఆసుపత్రిలో ముగ్గురు చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. వారంతా ప్రస్తుతం బాగానే ఉన్నారని తెలిపారు. మిగిలిన వారు అనకాపల్లి జిల్లాలోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని వివరించారు. మొత్తం 41 మంది గాయపడ్డారని చెప్పారు. దుర్ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడామని తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# వేరే లెవెల్ లోకి పిఠాపురం నియోజకవర్గం

కాకినాడ, ఆగస్టు 22, మూడు నెలల కింది వరకు ఓ లెక్క. ఇప్పుడు ఇంకో లెక్క. ఇప్పుడు పిఠాపురం అందరి పురం అయిపోయింది. మెగా కుటుంబమే కాదు.. సినీ ఆరిస్టులు, పవన్ కల్యాణ్ అభిమానులు అందరూ.. తమది పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అని చెప్పుకొంటున్నారు. ఏపీలో 175 నియోజకవర్గాలు ఒక ఎత్తు అయితే.. పిఠాపురం సెగ్మెంట్ మాత్రం సమ్‌థింగ్ స్పెషల్ అయిపోయింది. కారణం జనసేనాని పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండటమే. ఎన్నికలకు ముందు వరకు అన్ని నియోజకవర్గాలలాగే పిఠాపురం కూడా ఓ సెగ్మెంట్. ఇప్పుడు పిఠాపురం సినీ, పొలిటికల్ హబ్‌గా మారుతోంది. ఏపీలో పవన్ సొంత నియోజకవర్గం ఏది అంటే.. ఆయనకు కూడా అది బిగ్ క్వశ్చన్‌గానే ఉండేది. తాను అందరివాడిగా ఉండాలని అనుకుంటానని చెప్పేవారు పవన్. తనకంటూ ఒక సొంత నియోజకవర్గం ఉండాలన్న ఆలోచన కూడా లేదని చెప్పుకొచ్చేవారు. అయితే ఇప్పుడు పవన్ కేరాఫ్ పిఠాపురం అయిపోయింది. ఆయనకంటూ ఒక సొంత నియోజకవర్గం ఏర్పడింది. పవన్ కూడా తన మంత్రిత్వ శాఖలలో ఏ కొత్త నిర్ణయం తీసుకున్నా పిఠాపురం నుంచే ప్రారంభించాలని ఆదేశిస్తున్నారు. అక్కడ ఇల్లు కూడా తీసుకున్నారు. పవన్ సోదరుడు నాగబాబు పిఠాపురం నియోజకవర్గ బాధ్యతలను చూస్తున్నారు. పవన్ అందుబాటులో ఉన్నా లేకున్నా నాగబాబు మాత్రం జన సైనికులకు, ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. జనసేనకు దక్కిన ఏకైక ఎమ్మెల్సీ సీటుని గెలిచిన హరిప్రసాద్ కూడా పిఠాపురాన్ని దత్తత తీసుకుంటానని చెప్పారు. ఇక జనసేన నాయకులు పలువురు పిఠాపురంలోని గ్రామాలను దత్తత తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ బయటికి వచ్చింది. మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ పిఠాపురంలో అపోలో హాస్పిటల్‌ను నిర్మించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకోసం అవసరమైన భూమి కోసం సెర్చ్ చేస్తున్నట్లు టాక్. రామ్‌చరణ్ సతీమణి ఉపాసన అపోలో యాజమాన్యంలో భాగం కావడంతో.. త్వరలోనే పిఠాపురంలో తమ ప్రాజెక్టును స్టార్ట్ చేస్తారని తెలుస్తోంది. మెగా కుటుంబంలో చాలా మంది హీరోలు ఉన్నారు. వారంతా కూడా తమకు తోచినట్లుగా పిఠాపురంలోని గ్రామాలను దత్తత తీసుకుని డెవలప్ చేయాలని చూస్తున్నారు. ఇప్పటికే పవన్ పుణ్యమా అని పిఠాపురంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. పవన్ మీద అభిమానంతో చాలామంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి భూములు కొని తమ ప్రాజెక్టులు పెట్టాలని అనుకుంటున్నారు. వీటితో పాటు మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ చక్కర్లు కొడుతోంది. మెగాస్టార్ చిరంజీవి తన మూవీ విశ్వంభర ప్రీ రిలీజ్ ఫంక్షన్ పిఠాపురంలో నిర్వహిస్తారని అంటున్నారు. ఎన్నికల్లో చెప్పినట్లుగానే పిఠాపురం నియోజకవర్గాన్ని.. ఏపీలోనే వేరే లెవల్‌కు తీసుకెళున్నారు పవన్. రాజకీయ జీవితంలో కొనసాగినంత కాలం పవన్ పిఠాపురం నుంచే పోటీ చేస్తారన్న చర్చ జరుగుతోంది. ప్రభుత్వ నిధులతో పిఠాపురం రూపురేఖలు మార్చేందుకు పవన్ ప్లాన్ చేస్తున్నట్లు జనసైనికులు చెప్తున్నారు.

# రాజధానిపై వైసీపీ సేమ్ స్టాండ్

విజయవాడ, ఆగస్టు 22, ఎన్నికల్లో ఓటమి ఎదురైనా వైసీపీ తీరులో మార్పు రావడం లేదు. ఈ ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయం సాధిస్తామని వైసిపి ధీమా వ్యక్తం చేసింది. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేశామని.. ప్రజలు ఆశీర్వదిస్తారని భావించింది. కానీ వైసీపీ ఒకటి తలిస్తే.. ప్రజలు మరోలా తీర్పు ఇచ్చారు. దారుణ ఓటమిని అంటగట్టారు. అటు మూడు రాజధానులు అంటూ హడావిడి చేసిన ఆ ప్రాంతీయులు సైతం ఆదరించలేదు. పాలనా రాజధానిగా విశాఖను ప్రకటించినా అక్కడి ప్రజలు ఆహ్వానించలేదు. అయినా సరే వైసిపి తీరు మారడం లేదు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చినా అదే పల్లవి వీడడం లేదు. తాజాగా విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈరోజు ఆయన శాసనమండలిలో పదవి ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా మూడు రాజధానుల అంశంపై మరోసారి మాట్లాడారు. ఇప్పటికీ వైసీపీ స్టాండ్ అదేనని చెప్పారు. అందులో మార్పు వస్తే తామే ప్రకటిస్తామని తేల్చేశారు. కూటమి ప్రభుత్వానికి కేవలం 75 రోజులు మాత్రమే అయ్యిందని.. కొంత సమయం ఇచ్చి మాట్లాడుతామని బొత్స తేల్చి చెప్పారు. అంతవరకు సమయం కావాలని అడిగారు. అయితే మూడు రాజధానుల విషయంలో ప్రజా తీర్పు స్పష్టంగా కనిపించినా.. వైసిపి తీరు మారకపోవడం విమర్శలకు తావిస్తోంది. 2014లో నవ్యాంధ్రప్రదేశ్ లో తొలిసారిగా అధికారంలోకి వచ్చింది తెలుగుదేశం. నాడు అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా ప్రకటించింది. సాక్షాత్ నాటి ప్రధాని నరేంద్ర మోడీ వచ్చి శంకుస్థాపన చేశారు. కీలక నిర్మాణాల పనులను సైతం ప్రారంభించారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అమరావతి రాజధానిని మార్పు చేసింది. ఆ స్థానంలో మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. ముఖ్యంగా విశాఖను పాలనా రాజధానిగా చేసింది. అయితే విశాఖ తో పాటు ఉత్తరాంధ్ర ప్రజలు దీనిని ఆహ్వానించలేదు. అలా జరిగితే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి ఓటమి ఎందుకు ఎదురయింది. ఈ ఎన్నికల్లో అయితే ఉత్తరాంధ్రలో వైసిపి తుడుచుపెట్టుకుపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అమరావతి రాజధానిపై దూకుడుగా ముందుకు సాగుతోంది. అటు కేంద్ర ప్రభుత్వం సైతం సహకరించేందుకు ముందుకు వస్తోంది. కీలకమైన ప్రాజెక్టులను అమరావతికి కేటాయిస్తోంది. రోడ్డు, రైలు రవాణాలో కీలక ప్రాజెక్టులను మంజూరు చేసింది. అదే సమయంలో కేంద్ర బడ్జెట్లో అమరావతి రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయలు కేటాయించింది. ఇలా అమరావతి విషయంలో కీలక అడుగులు పడుతున్నాయి. అయినా సరే వైసీపీ ఇంకా మూడు రాజధానుల స్టాండ్ తోనే కొనసాగుతుండడం విశేషం. ఐదేళ్లలో అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి కావడం ఖాయం. అమరావతిని తప్పించి రాజధానిని మార్చడం కూడా అసాధ్యం.

# చెరువులు కుంటలకు చేరుతున్న నీటిని పరిరక్షించాలి

## - రాంభూపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి,

అనంతపురం,చెరువులు, కుంటలకు చేరుతున్న నీటిని పరిరక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అన్నారు. జిల్లాలో గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల 116 చెరువులు, వందలాది కుంటలు పొంగిపొర్లుతున్నాయి. ఈ నీటిని పరిరక్షించుకునేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. గత సంవత్సరం ఖరీఫ్ రబీ సీజన్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఈ సంవత్సరం మే నెలలో అధికార నివేదికలు తెలిపాయని అన్నారు. ఏప్రిల్, మే నెలల్లో గార్లదిన్నె పుట్లూరు మండలాలలో ట్యాంకర్ల ద్వారా చీనీ, అరటి పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నించారు. ఈ సంవత్సరం జూలై నెలలో వర్షాలు రాకపోవడంతో పంటల సాగు తగ్గిందన్నారు. కర్ణాటకలో కురిసిన వర్షాల వల్ల తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోయి సుమారు 40 టీఎంసీల నీరు సముద్రం పాలైంది ఇట్లాంటి స్థితిలో మన జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల చెరువులు కుంటలకు చేరుతున్న నీటిని పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు.

# ప్రకృతి సేద్యంతో జీవన ప్రమాణాలు మెరుగు

మైలవరం, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచుకుందామని కలెక్టర్ సృజన అన్నారు. జి కొండూరు మండలంలోని చెవుటూరులో ప్రకృతి సేద్యం చేస్తున్న మహిళ రైతులతో ఆమె మాట్లాడారు. రైతులు పండించే పంటలపై ఆరా తీశారు. పంటలకు చీడపీడలు ఆశించకుండా ఎటువంటి కషా యాలు వాడుతున్నారో, ఎంత దిగుబడి వస్తుంది, పంటను ఎలా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారో రైతులను అడిగి తెలుసుకున్నారు. భవిష్య త్తులో ప్రకృతి సేద్యం చేసే రైతులకు రాయితీపై ప్రోత్సాకాలను అందించి, పండిన పంటలను పాఠ శాలలకు మధ్యాహ్న భోజనంకు, వసతి గృహాలకు సప్లై చేసేలా పైలెట్ ప్రాజెక్టు ప్రారంభిద్దామని రైతు లకు హామీ ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలించి, చిన్నారులకు అందించే పౌష్టికాహారం, పరిశుభ్రత పరిశీలించారు. జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్నంభోజనం రుచి చూసి, పిల్లలకు ఆమె స్వయంగా వడ్డించారు.

# ఏసీబీ వలలో మహిళా ఎస్సై

విశాఖపట్నం ,విశాఖ జిల్లాలో ఓ అవినీతి పోలీసు అధికారిని అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. మల్కా పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన మోసం కేసులో నిందితులను రిమాండుకు పంపిం చకుండా ఉండేందుకు మల్కాపురం పోలీస్ స్టేషన్లో ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న కె దేముడమ్మ ఫిర్యాదుదారు నుంచి డబ్బులు డిమాండ్ చేసిన నేపథ్యంలో బాధితుల ఫిర్యాదు మేరకు ఎసిబి డిఎస్పీలు నాగేశ్వరరావు రమ్య ల ఆధ్వర్యంలో అధికారులు బాధితుల నుంచి లంచం డబ్బులు తీసుకుం టుండగా ఎస్ఐ కె దేముడమ్మను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. డిఎస్పీ రమ్య తెలిపిన వివరాల ప్రకారం కేసులో బాధితుల నుంచి ముప్పైవేలు రూపాయాలు డిమాం డ్ చేసి అందులో భాగంగా పదివేల రూపాయలను తీసుకుం టుండగా అధికారులు ఆకస్మిక దాడి చేసి పట్టుకున్నారు. సుమారు రాత్రి ఏడు గంటల ప్రాంతంలో పోలీస్ స్టేషన్ వద్ద కాపు కాసిన అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవటం నగరం లో సంచలనం రేపింది.

# వైకాపా రాష్ట్ర అధ్యక్షుడిగా కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్రెడ్డి

**అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్రెడ్డి**

**వైయస్ఆర్ జిల్లా జడ్పీ ఛైర్మన్ అభ్యర్థిగా బ్రహ్మంగారి మఠం జడ్పీటీసీ రామగోవిందరెడ్డి**

బద్వేలు ఉమ్మడి వైయస్ఆర్ కడప జిల్లాకు చెందిన పార్టీ నాయకులతో వైయస్ఆర్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్రెడ్డి సమావేశమయ్యారు. వైయస్ఆర్ , అన్నమయ్య జిల్లాల పార్టీ అధ్యక్షులుగా ఎవరిని నియమించాలన్నదానిపై వారితో చర్చలు జరిపారు. దీంతోపాటు రాబోయే వైయస్ఆర్ జిల్లా జడ్పీ ఛైర్మన్ అభ్యర్థిత్వంపైనా వారి అభిప్రాయాలు తీసుకున్నారు. పార్టీ సూచనల మేరకు వైయస్ఆర్ జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్రెడ్డిని, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్రెడ్డిని నియమించారు.

## ఫలించిన శ్రమదానం... అహోబిలం ప్రహ్లాద పుష్కరిణికి జలకళ..



ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 22 విభారె న్యూస్ :–ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలం ఆలయానికి సమీపంలో ఉన్న ప్రహ్లాద పుష్కరిణి జలకల సంతరించుకుంది.కొన్నిదశాబ్దాలకుఈపుష్కరిణి నిరుపయో గంగా మారింది. ఇంటాక్ సభ్యులు, ఇంజనీరింగ్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు గతంలో పూడిక తీసి సమాధానం చేసిన ఫలితంగా నేడు పుష్కరిణి నీటితో నిండి కళకళలాడుతున్నది. ఇదే తరహాలో అహోబిలం పరిసర ప్రాంతాలలో ఉన్న బావులు, పుష్కరణలను వాడుకలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అహోబిలం దేవస్థానం కమ్యూనికేషన్ అధికారి కిడాంబి సేతురామన్ గురువారం తెలిపారు.

## జూనియర్ సివిల్ కోర్టు నూతన జడ్జిని కలిసిన మున్సిపల్ కమిషనర్....





ఎమ్మిగనూరు ఆగష్టు 22 విభారె న్యూస్..22 వ తేదీ అనగా గురువారం రోజు ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ ఎన్ గంగిరెడ్డి జూనియర్ సివిల్ కోర్టు నూతన జడ్జి హేమని పుష్పగుచ్చం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు...

## రుద్రవరం ఎస్సైని సన్మానించిన యల్లా వత్తుల సర్పంచ్ చంద్రమోహన్

రుద్రవరం.ఆగస్ట్22 :ఇటీవల రుద్రవరం మండల ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై వరప్రసాద్ ను యల్లావత్తుల గ్రామ సర్పంచి చంద్రమోహన్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం టిడిపి నాయకులు బొకే లను ఇచ్చి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రజలు సుఖశాంతులతో జీవించేందుకుగాను , శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా తమ వంతుగా సహాయ సహకారాలను అందివ్వడం జరుగుతుందని వారు తెలిపారు..ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం, కిట్టు, ఈశ్వరయ్య, జయసింహుడు ,మహేష్ తదితరులు ఉన్నారు.

# సెబి చీఫ్ వెంటనే రాజీనామా చేయాలి

### జె పి సి తో విచారణ జరపాలి
### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే బాబురావు





విభారే న్యూస్. ఆగస్టు 22. కర్నూల్ ప్రతినిధి సెబి చీఫ్ మాధురి పురి బచ్ వెంటనే రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు డిమాండ్ చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ముందు జరిగిన నిరసన కార్యక్రమంలో డీసిసి అధ్యక్షులు బాబురావు మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ముందు సెబి చీఫ్ మాధబి పురి బచ్ కు ఆదాని గ్రూప్ సంస్థల వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం జెపిసి వేయాలని దేశంలో జరుగుతున్న అతి పెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణం పై వినూత్నంగా చర్చ జరగాలని ఆదాని సెబి సంబంధాలపై హిండేన్ బర్గ్ నివేదికలో వెల్లడించిన అంశాలపై విచారణ జరపాలని ఫైనాన్షియల్ మార్కెట్లను నియంత్రించాల్సిన సెబి రాజీ పడటం ఈ కుంభకోణంలో ప్రధాన మంత్రి పాత్ర పూర్తిగా ఉందని సెబి చైర్ పర్సన్ ను తొలగించాలని విశ్వాసనీయత కోల్పోయిన వ్యక్తి ఆ పదవిలో ఉండడానికి వీల్లేదని జేపీసీ ద్వారా ఈ మెగా కుంభకోణం పై దర్యాప్తు జరిపించాలని బాబురావు డిమాండ్ చేశారు. గత కాంగ్రెస్ యూపీఏ ప్రభుత్వంలో టుజి స్కాంకు సంబంధించి అప్పటి ప్రతిపక్ష బిజెపి జెపిసి కమిటీ వేయాలని డిమాండ్ చేస్తే వెంటనే అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వేశారని నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎందుకు వెనుకడుగు వేసి మౌనంగా ఉన్నారని బాబురావు ప్రశ్నించారు. సెబికి ఆదానికి మధ్య సంబంధాలపైగ్రాన్ఠంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయని వీటిపై లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని మోడీ ప్రభుత్వం తక్షణమే సెబి చైర్పర్సన్ను రాజీనామాను కోరాలని దీనిపై జేపీసీ ఏర్పాటు చేయాలని బాబురావు డిమాండ్ చేశారు. సెబి సంస్థల ద్వారా ఆదాని సంస్థలకు లబ్ధి చేకూర్చి పెడుతున్నారని కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం పదేళ్లు పూర్తి చేసుకుని 11వ ఏట అడుగుపెట్టిందని ఈ మధ్య కాలంలో ప్రధాని మోదీ అనేక దేశాల పర్యటనలకు వెళ్లాడని వాటికి సంబంధించిన ఖర్చులు అధికారికంగా శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోడీ విదేశీ పర్యటనల వల్ల ఏం లాభం జరిగిందో తెలపాలని, దేశంలో వనరులను ధారా దత్తం చేశారని మైన్స్ ను అంబానీ, ఆదానిలకు కట్టబెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన అంశాలను అమలు చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. ప్రభుత్వ శాఖల ప్రక్షాళనతో పాటు అభివృద్ధి సంక్షేమాలపై దృష్టి పెట్టాలని బాబురావు గారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన అభ్యర్థులు కర్నూలు షేక్ జిలాని భాష, ఆదోని జి రమేష్ యాదవ్ పీసీసీ అధికార ప్రతినిధి బి రామాంజనేయులు కోఆర్డినేషన్ చైర్మన్ అనంతరత్నం, డిసిసి ఉపాధ్యక్షులు బి బతుకన్న, దిలీప్ దోక, డిసిసి ప్రధాన కార్యదర్శులు సయ్యద్ నవీద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, ఎస్టీ సెల్ చైర్మన్ మారుతి రావు కోసిగి జిలాని సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముర్షిద్ షీర్ ఖాద్రి, డిసిసి కార్యదర్శులు బి సుబ్రహ్మణ్యం, యజస్ అహ్మద్ ఎస్సీ సెల్ డబ్ల్యూ సత్యరాజు కాంగ్రెస్ నాయకులు వి సాంబశివుడు నాగరాజు పశువుల ప్రతాపరెడ్డి మురళి దేవిశెట్టి వీరేష్ శ్రీనిధి రాయల్, రంగస్వామి, నాగరాజు మహిళా కాంగ్రెస్ రాజేశ్వరి, సాయి భార్గవి, మద్దమ్మ, మొదలగు వారు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన ఆళ్లగడ్డ బ్లడ్ డోనార్స్ టీం అధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్





ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 22 విభారె న్యూస్ :- నంద్యాల పట్టణంలో ఇండస్ హాస్పిటల్ నందు హుస్సేన్ బి అనే పేషెంట్ కు బి-నెగటివ్ రక్తం అవసరం అవ్వగా పేషెంట్ బంధువులు నంద్యాల బ్లడ్ సెంటర్ వారిని సంప్రదించగా నిర్వాహకులు బ్లడ్ అచ్చు వెంటనే స్పందించి ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం అధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్ కు ఫోన్ చేయగా స్పందించి ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు వెళ్లి గురువారం రక్తదానం చేశారు. అవసరమైన సమయంలో అవసరమైన సమయంలో రక్తదానం చేసిన మహమ్మద్ హుస్సేన్ కు హుస్సేన్ బి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం అధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో రక్తం దొరక్క చాలా మంది ఇబ్బంది పడుతున్నారని యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునని తెలిపారు. ఇప్పటికి తాను నాలుగు సార్లు రక్తదానం చేశానన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల బ్లడ్ సెంటర్ నిర్వాహకులు అచ్చు, ప్రవీణ్ పాల్గొన్నారు.

## పేదింటి ఆడపిల్ల పెళ్లికి స్ఫూర్తి చేయూత....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :–జూలై 22 డోన్ పట్టణం కొండపేట ప్రాంతంలో నివసించే నిరుపేదలైన జగన్నాథరావు, సంధ్యా భాయి దంపతుల కుమార్తె చైతన్య అనే అమ్మాయి పెళ్లికి ఆర్థిక కష్టాలు ఉన్నాయని తెలుసుకున్న స్ఫూర్తి సేవా సమితి దాతల సహకారంతో సేకరించిన 35 వేల రూపాయల విలువైన బంగారు తాళిబొట్టు మెట్టెలు, 50కేజీల బియ్యము, పట్టుచీరలు, పెళ్లి సరుకులు, మరియు కొంత ఆర్థిక సహాయాన్ని పెళ్లి కుమార్తె తల్లిదండ్రులకు అందించారు. తమ కుమార్తె పెళ్లికి సాయం కావాలని అడిగిన వెంటనే సాయం అందించిన ప్రతి ఒక్క దాతకు, స్ఫూర్తి సేవాసమితి వారికి జగన్నాథ రావు దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సంస్థ అధ్యక్షుడు స్ఫూర్తి మధు, సభ్యులు చంద్ర, మోహన్ రెడ్డి, భాస్కర్, హేమలత, నారాయణస్వామి,రాయల్‌రఫీ,భాస్కర్ నాయుడు, శివయ్య పాల్గొన్నారు.

## ఎన్ ఎస్ యు ఐ లోకి చేరిక

### సంగం బలోపేతానికి కృషి చేద్దాం అని పిలుపునిచ్చిన తెలుగు విజయ్ కుమార్





డోన్ గుత్తి రోడ్ లోనిఎన్ ఎస్ యు ఐ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బు యాదవ్ గారి సమక్షంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా ఉపాధ్యక్షులు తెలుగు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో, విద్యార్థి సంఘం నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా ఎన్ ఎస్ యు ఐ లోకి షేక్‌మాబు, షేక్ దాదా కలందర్, రఫీ లు చేరడం జరిగింది.అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బు యాదవ్ గారు ఎన్ ఎస్ వై జిల్లా ఉపాధ్యక్షులు తెలుగు విజయ్ కుమార్ లు మాట్లాడుతూ ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇప్పుడున్న విద్యారంగ వ్యవస్థలో విద్యార్థులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ నారని , పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారుతుందని , ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అయితే ప్రభుత్వ విద్య సంస్థలు మరియు ప్రభుత్వ రంగాలు అన్ని బలోపేతం కావాలంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ గారితోనే సాధ్యమని అందుకే రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ గారిని ప్రధాని చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అందుకే ప్రతి ఒక్క విద్యార్థులు, యువకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ముందుకొస్తున్నారని, ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆంధ్రప్రదేశ్లో కూడా ఎగరవేస్తామని వారు తెలియజేశారు. అలాగే విద్యాసంస్థల్లో సమస్యల పట్ల తాము విద్యార్థుల పట్ల నిలబడి వారికి న్యాయం జరిగేంత వరకు పోరాటాలు చేస్తామని , ఎన్ ఎన్ యు ఐ విద్యార్థుల పట్ల ఎల్లప్పుడూ తోడు నీడలా ఉంటుందని వారు తెలియజేశారు..

## 24 న ఆళ్లగడ్డ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం...



ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 22 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ అధ్యక్షుడు గజ్జల రాఘవేంద్ర రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహబూబ్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, జడ్పిటిసి, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**